క్లుప్తంగా

ఫీజులను నియంత్రించాలి



సంతకాల సేకరణ చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వైరా: ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలని ఎస్‌ఎఫ్‌ఐ వైరా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వైరాలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం బాధ్యత వహించి ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల్లో ఫీజుల నియంత్రించాలన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 15శాతం నిరుపేదలకు సీట్లు ఇవ్వాల్సిన కార్పొరేట్ సంస్థలు సీట్లు ఇవ్వక పోవడంతో నిరుపేదలు నాణ్యమైన విద్యకు దూరం కావాల్సి వస్తుందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి కోట ప్రేమ్‌కుమార్, సీపీఎం మండల నాయకులు తోట నాగేశ్వరరావు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నాగరాజు, ఉపేందర్, గణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణం చేపట్టాలి

వేంసూరు: బేతుపల్లి ప్రత్యామ్నాయ కాలువ నుంచి కల్లురుగూడెం చెరువులకు సాగునీరు చేరేలా ఫీడర్ కెనాల్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే మట్టా రాగమయికి కల్లురుగూడెం గ్రామస్తులు శనివారం వినతిపత్రం అందించారు. అదే విధంగా గ్రామంలోని తుమ్మల చెరువు తూములు రిపేరు చేపట్టడంతో గ్రామంలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని కోరారు. అదే విధంగా ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిలుపుదల చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రామోజీరావు మృతిపై సంతాపం



రామోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, తదితరులు

సత్తుపల్లి/సత్తుపల్లి రూరల్: మీడియా రంగంతోపాటు ఇతర సంస్థలు స్థాపించిన రామోజీరావు మృతి తీరని లోటని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. స్థానిక రింగ్ సెంటర్‌లో శనివారం సాయంత్రం రామోజీ చిత్రపటం వద్ద ఆమె నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చల్లగుళ్ల నర్సింహారావు, ప్రైవేట్ విద్యాసంస్థల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావుతో పాటుపోట్రు రామారావు, పోట్రు సరస్వతి, బి.మధుసూదన్‌రాజు, రామ్మోహన్‌రెడ్డి, మోరంపూడి పాండు, బొంతు శ్రీను, రామకృష్ణ, బాలకృష్ణ, బాలయ్య, రవి తదితరులు పాల్గొన్నారు. అలాగే, రామోజీరావు మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

కేవీ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



కారేపల్లిలో కేవీస్కూల్‌ను ప్రారంభిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి: కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కేవీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శనివారం ప్రారంభించారు. స్కూల్ కరస్పాండెంట్ వి.కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నరేష్‌లు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్, సురేందర్ మనియార్, మేదరి టోనీవీరప్రతాప్, ఇమ్మడి తిరుపతిరావు, అడ్డగోడ ఐలయ్య, నర్సింగ్ శ్రీనివాసరావు, యాకూబ్ అలీ, భీముడు, వినోద్, భద్రు నాయక్, గోపాల్‌నాయక్, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, హర్షనాయక్, సైదులు, హనీఫ్, షంషుద్దీన్, తాజుద్దీన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుడికి అభినందనలు

తల్లాడ: గత మదమూడు సంవత్సరాలుగా మండలంలోని అన్నారుగూడెం జెడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు మాదినేని నరసింహారావు కొణిజర్లలోని పెద్దగోపతి ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. దీంతో శనివారం ఆ పాఠశాలలో చేరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పూర్వ, ప్రస్తుత విద్యార్థులు ఆయనను అభినందించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ఆయన దాతల సహకారంతో చేపట్టిన పనులను గుర్తుచేసుకున్నారు. ఈ క్రమంలో ఆయనకు గతేడాది రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు వచ్చింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం..

- జాతీయ ఉపకార వేతనాలకు మేడేపల్లి విద్యార్థులు
- ఏటా అధిక సంఖ్యలో ఎంపికవుతున్న వైనం..
- ఎన్‌ఎంఎంఎస్‌కు జిల్లాస్థాయిలో టాపర్లుగా..





మేడేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల

ముదిగొండ: గత ఐదేళ్లల్లో మేడేపల్లి పాఠశాలకు చెందిన 25మంది ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఈ ఏడాది 11మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌లో ఎంకయ్యారు. ఒకే పాఠశాల నుంచి అత్యధిక మంది ఎంపికైన విభాగంలో జిల్లాలోనే ఈ పాఠశాల ప్రథమస్థానంలో నిలిచింది. అందుకే విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. విద్యార్థుల ప్రతిభతో జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికవుతున్నారు.

ఉపాధ్యాయుల శిక్షణతో..

ఉపాధ్యాయుల మెరుగైన శిక్షణ విద్యార్థుల పట్టుదల ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఎన్‌ఎంఎంఎస్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఆన్‌లైన్‌లో మెటీరియల్ డౌన్‌లోడ్ చేసి ప్రతి సబ్జెక్ట్ టీచర్ టైంటేబుల్‌తో పాటు ప్రత్యేక ఎన్‌ఎంఎంఎస్‌కు శిక్షణ ఇస్తున్నారు. విద్యసంవత్సరం ఆరంభం నుంచే ఈ ప్రక్రియ మొదలవుతుంది. విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తూ తక్కువ వచ్చిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి వారు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు.

ఎంపికైన విద్యార్థులు..

ఈ ఏడాది దుశర్ల యశ్వంతి, జూలకంటి పునీత్‌రెడ్డి, రెడ్డిమళ్ల వరుణ్‌సందేశ్, ఆనందతీర్థ, కటికల లావణ్య, చెన్ను సింధు, బయ్యం చందన, ఎరకల కార్తీక్, బొడ్డు ముఖేశ్, రెడ్డిమళ్ల హర్షిత, పెండ్యాల సాత్విక్ లు ఎంపికైయ్యారు. గత ఐదేళ్లల్లో.. 2019–20లో ఏడుగురు విద్యార్థులు, 2020–21లో ఐదుగురు, 2021–22లో ఆరుగురు, 2022–23లో ఇద్దరు, 2023–24లో 11మంది విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. జిల్లాలోనే ఆదర్శంగా మేడేపల్లి పాఠశాల నిలుస్తోంది. విద్యార్థులకు అందరి ప్రశంసలు అందుతున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసి, వారికి ఉపకార వేతనాలు అందించేందుకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ సర్టిఫికెట్ (ఎన్‌ఎంఎంఎస్) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం మారుమూల ప్రాంత వాసులు, పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లల చదువులకు ఎంతగానో ఉపయోగపడతాయి. చదువులకు, క్రమశిక్షణకు, జాతీయ ఉపకార వేతనాలకు పెట్టింది పేరు మేడేపల్లి జెడ్పీఉన్నత పాఠశాల. దీంతో ప్రతీ ఏటా క్రమం తప్పకుండా ఎంపికౌతున్నారు.

శిక్షణ ఉపయోగపడింది..



ఉపాధ్యాయులు ఇచ్చిన శిక్షణ ఎంతగానో ఉపయోగపడింది. 160మార్కులకు గాను 138మార్కులు రావడానికి సమ్మర్‌లో శిక్షణ పొందడమే కారణం, నిరంతరం చేసిన సాధన వల్ల జిల్లాలో టాపర్‌గా నిలిచాను. మొదట్లో ప్రైవేటు పాఠశాలకు వెళ్లేవాళ్లం.

– దుశర్ల యశ్వంతి, విద్యార్థి, యడవల్లి

పట్టుదల పెరిగింది..



నాకు ఎన్‌ఎంఎంఎస్‌లో 160కి 128 మార్కులు వచ్చాయి. మా పాఠశాలలో పద్మశ్రీ మేడం ఇచ్చిన నెలవారి శిక్షణ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడ్డాయి. సెలవు రోజుల్లో కూడా శిక్షణ ఇవ్వడం మాకు ఎంతో ఉపయోగపడింది.

– జూలకంటి పునీత్‌రెడ్డి, విద్యార్థి, మేడేపల్లి

ఎంతో సంతోషం..



మాపాఠశాలలో ఉపాధ్యాయులు ఇచ్చిన శిక్షణతో ప్రతి సబ్జెక్టుల వారికి మెటీరియల్ అందజేసి, శిక్షణ ఇవ్వడంతో ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఇంటర్ వరకు ప్రతి ఏడాది ఉపకార వేతనం అందడం ఉన్నత చదువులకు ఉపయోగపడుతుంది.

– రెడ్డిమళ్ల వరుణ్‌సందేశ్, యడవల్లి

మృగశిర కార్తె.. చేపలకు డిమాండ్

జోరుగా సాగిన కొనుగోళ్లు



వైరాలో చేపలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

వైరా/కొణిజర్ల: మృగశిర కార్తె సందర్భంగా వైరా నియోజకవర్గ పరిధిలోని వైరా, కొణిజర్ల, ఏన్కూరు మండలాల్లో శనివారం ప్రజలు చేపలు కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. మృగశిర కార్తె ఎండ వేడిమిని ఉపశమనం కలిగిస్తుందని పేరు అంతే కాకుండా ఆహార ఆరోగ్య పరంగా కూడా విశేష ప్రాధాన్యం కలిగి ఉంది. మృగశిర కార్తె నాడు చేపలు ఆహారంగా తీసుకుంటే శ్వాస సంబంధమైన వ్యాధులు దూరమవుతాయని నమ్మకం ఉండటంతో ప్రజలు విపరీతంగా కొనుగోలు చేశారు. ఇదే అదనుగా చేపల వ్యాపారులు ధరలు అమాంతం పెంచేశారు. వైరా పరిసరప్రాంతాల్లో చేపలు దొరక్క ఇతర ప్రాంతాల నుంచి లారీలలో తీసుకొచ్చి అమ్మకాలు సాగించారు. సాధారణంగా కిలో రూ.130 నుంచి రూ.150 వరకు అమ్మకాలు చేసే రైతులు శనివారం మాత్రం రూ.250 నుంచి రూ.300 వరకు అమ్మకాలు చేపట్టారు. ఇంత రేటు పెంచిన చేపల మార్కెట్ కొనుగోలుదారులతో సందడిగా మారింది.

మృగశిర సందడి..



తల్లాడ చేపల మార్కెట్ వద్ద సందడి

తల్లాడ: మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా తల్లాడ చేపల మార్కెట్ కళకళ లాడింది. తల్లాడలోని కొత్తగూడెం రోడ్డులో చేపలు కొనుగోలు చేసేందుకు విక్రయదారులు ఎగబడ్డారు. మృగశిర కార్తె రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదనే అభిప్రాయంతో ఎక్కువ మంది చేపలు తీసుకెళ్లారు.

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలోని ప్రజలు మృగశిర సందర్భంగా మార్కెట్‌లో చేపలు కొనేందుకు ఆశక్తి చూపారు. దీంతో మార్కెట్లు రద్దీగా మారాయి.

దంచికొట్టిన వాన

వైరారూరల్/తల్లాడ: వైరా పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో, తల్లాడలో శనివారం మధ్యాహ్నం సుమారు గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజుల నుంచి తీవ్రమైన ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. అలాగే ఇప్పటికే వ్యవసాయ పనులు ఊపందుకోని మండల వ్యాప్తంగా రైతులు పత్తి విత్తనాలు విత్తుకోని రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్న సమయాన శనివారం కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



వైరాలో కురుస్తున్న భారీ వర్షం

విరగబూసిన చెట్లు..



ఆకట్టుకుంటున్న పూల చెట్లు

మధిర నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో మీనవోలు వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పూల చెట్లు విరగబూశాయి. ఎర్రని పూలతో ఆకట్టుకుంటున్నాయి. అదే విధంగా రోడ్డు పక్కనే చెట్లు ఉండటం, ఆ చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వంగి ఉండటం మధ్య మధ్యలో పూలచెట్లు సైతం రోడ్డుపైకి ఎగబాకడంతో అందంగా ఉంది. ఈ రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పచ్చని చెట్లు, రంగురంగుల పూలతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. వర్షాలు కురవడం వల్ల రోడ్డు పక్కన గడ్డి మొక్కలతో పచ్చగా ఉండి కనువిందుగా కనిపిస్తుంది.

– మధిర

ప్రపంచ క్షేమాన్ని కోరేది హిందూ ధర్మం



బురదరాఘవాపురంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఏన్కూరు: ప్రపంచ క్షేమాన్ని కోరేది హిందూ ధర్మమని విశ్వహిందు పరిషత్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల్ల సత్యం అన్నారు. మండలంలోని బురదరాఘవాపురం గ్రామంలో శనివారం గాయత్రి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రాంత విశేష సంపర్క ప్రముక్ జి.వెంకటేశ్వరరావు, కోదుమూరి రాజయ్య, వడ్లమూడి రాఘవరావు, దుద్దుకూరి వెంకటేశ్వరావు, వడ్లమూడి సురేష్‌బాబు, గుర్రం రమేష్, కట్టా వైదేహి, మాదినేని చైతన్య, కట్టా ఖాదర్ బాబు, నరుకుళ్ల వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



నల్లాన్ చక్రవర్తుల శ్రీరామకృష్ణామాచార్య

సత్తుపల్లిరూరల్: టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన శ్రీవైష్ణవ విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యాన ప్రతిభా పురస్కారాలు అందించబడతాయని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జులై 20న హైద్రాబాద్‌లో జరిగే రజితోత్సవ వేడుకల్లో ఈ పురస్కారాలు అందించబడతాయని, జిల్లా శ్రీవైష్ణవ సేవా సంఘానికి జిల్లాలోని శ్రీవైష్ణవ విద్యార్థులు మార్కుల మెమో, తల్లిదండ్రుల వివరాలను అందించాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేషాబట్టర్ రఘునాథాచార్యులు, రవికిరణాచార్యులు, శ్రీనివాసాచార్యులు, మరింగంటి భార్గవాచార్యులు, వెంకటాచార్యులు, సాయిరాం పాల్గొన్నారు.

రేషన్ డీలర్ మృతిపై సంతాపం



వెంకటేశ్వరరావు (ఫైల్)

చింతకాని: చింతకాని గ్రామ రేషన్ డీలర్ కిలారు వెంకటేశ్వరరావు (66) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. శుక్రవారం అస్వస్థతకు గురైన వెంకటేశ్వరరావు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతురావు, కాంగ్రెస్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, పుల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి గోపాలరావు, కాంగ్రెస్, టీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ, టీడీపీ నాయకులు, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రాజీ మార్గమే మేలు



మధిర: మాట్లాడుతున్న న్యాయమూర్తి కార్తీక్ రెడ్డి



సత్తుపల్లిటౌన్: విద్యార్థికి ప్రోత్సాహం అందజేస్తున్న 6వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్

మధిర: కేసుల విషయంలో రాజీ మార్గమే మేలని మధిర కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్ రెడ్డి తెలిపారు. శనివారం మధిర కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో 931 కేసుల పరిష్కారమయ్యాయి. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఎక్సైజ్ కేసులతో సహా 174 కేసులు పరిష్కారం కాగా.. రూ.1,06,370 లు జరిమానా విధించారు. అదే విధంగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 76 కేసులు పరిష్కారం కాగా.. రూ.35,700 లు జరిమానా విధించారు. న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, నంబూరు జనార్ధన్ రావు, జ్ఞానేశ్, శ్రీనివాసరావు, సతీష్, వెంకట్రావు పాల్గొన్నారు.

సత్తుపల్లిటౌన్: లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులకు చట్టబద్ధతతో పాటు సత్వర న్యాయం లభిస్తుందని సత్తుపల్లి 6వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లిలో శనివారం జరిగిన మెగా లోక్ అదాలత్‌తో ఆయన మాట్లాడారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఎస్సీ, ఎస్టీలు, మహిళలు, పిల్లలు, విపత్తుల బారినపడిన వారికి, వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉన్న వారికి ఉచిత న్యాయ సహాయం అందించబడుతుందని తెలిపారు. అనంతరం 10వ తరగతిలో 10జీపీఏ సాధించిన జె.రోహిత్‌కృష్ణకు బార్ అసోసియేషన్ తరుపున నగదు ప్రోత్సాహక బహుమతిని అందించారు. కక్షిదారులకు పులిహోర పంపిణీ చేశారు. లోక్ అదాలత్‌తో 506 కేసులు పరిష్కరించి రూ.73,48 లక్షలు కక్షిదారులకు ప్రయోజనం చేకూరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్‌జడ్జి షేక్ మీరా ఖాసీం, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వడ్డి లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు తేళ్లూరి ఆడమ్స్, ఏపీపీ ఎస్‌కె భాష, ఏఓ బోయినపల్లి రవి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపాలి



మధిరరూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



చింతకాని: విద్యార్థులకు ప్రవేశపత్రాలు అందిస్తున్న సీఎంఓ రాజశేఖర్



ముదిగొండలో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మధిరరూరల్: విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపాలని మడుపల్లి హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం తోట నరసింహారావు కోరారు. గ్రామంలో శనివారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 5వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులను 6వ తరగతిలో చేర్పించాలని మడుపల్లి బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అర్జున్‌ని కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బూసా కోటేశ్వరరావు, కంచిపోగు ఆదాం, కిషోర్, రామిరెడ్డి, బాబురావు, కృష్ణయ్య, చిట్టిబాబు, ఏఏపీసీ చైర్మన్ నాగమణి పాల్గొన్నారు.

చింతకాని: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించటం జరుగుతుందని కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి యలగందుల రాజశేఖర్ తెలిపారు. మండలంలోని పందిళ్లపల్లి, అనంతసాగర్ గ్రామాల్లో శనివారం ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అనంతసాగర్ గ్రామంలో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వ పాఠశాలకు పంపించేలా ఒప్పించి పాఠశాలలో చేరుతున్నట్లు విద్యార్థులకు ప్రవేశపత్రాలను కూడా అందజేశారు. అనంతరం అనంతసాగర పాఠశాలలో పందిళ్లపల్లి, అనంతసాగర్ పాఠశాలల ఉపాధ్యాయులతో సమీక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు ఉన్నాయని ఎంఈఓ రామాచారీ అన్నారు. మండలపరిధిలోని గోకినేపల్లి, వెంకటాపురం, యడవల్లి, మిట్టగూడెం, కమలాపురం, ముత్తారం, వల్లాపురం పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్‌ఎం శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ఫ్లెక్సీలతో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జహీర్, యలమందారావు, పి.సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరులో గల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించే క్రమంలో గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించటం కోసం బైక్ యాత్ర ప్రారంభించారు. శనివారం బత్తులపల్లి పంచాయతీ పరిధిలోని ఉపాధ్యాయులు ప్రచారం చేపట్టారు. ఈ ప్రచారం ఈ నెల 17వ తారీకు వరకు ప్రచారం చేయనున్నారు. సుధాకర్ కరోనా కాలంలోకూడా ప్రజలకు అవగాహన కల్పించి కలెక్టర్‌తో పాటు పలువురు అధికారుల మన్ననలు పొందారు.

ఏన్కూరు: మండలంలోని కేసుపల్లి, ఆరికాయలపాడు గ్రామాల్లో శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సైదయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీధర్, బీవీ విజయలక్ష్మి, కస్తూరి, రాము తదితరులు పాల్గొన్నారు.



కల్లూరురూరల్: బైక్‌పై ప్రచారం చేపట్టిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుధాకర్



ఏన్కూరు: కేసుపల్లిలో..

ప్రమాదకరంగా రహదారులు



మధిర రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఉన్న ప్రమాదకర గుంతలు



రాయపట్నం సమీపంలోని రోడ్డుపై ఏర్పడిన గుంతలు

మధిర: నియోజకవర్గ కేంద్రమైన మధిర పట్టణం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారులు గుంతలు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. ముఖ్యంగా పట్టణ నడిబొడ్డున ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జిపై రబ్బర్ బెడ్లు ఊడిపోయి గుంతలు పడ్డాయి. గుంతలను తప్పించేందుకు వాహనదారులు ప్రయత్నించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ క్రమంలో ఇటీవల ఒక ప్రైవేట్ బస్సు డ్రైవర్ మృతి చెందాడు. మరికొంతమంది శరీర అవయవాలను కోల్పోతున్నారు.

– మధిర నుంచి విజయవాడ వైపు వెళ్లే రహదారిలో రాయపట్నం, దేశినేనిపాలెం గ్రామాల మధ్య గుంతలు తేలి ప్రమాదకరంగా ఉన్నాయి. లోతైన గుంతలు కావడంతో వర్షపు నీరు నిల్వ ఉండి గుంతలు కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అదేవిధంగా ఇల్లెందులపాడు, దెందుకూరు గ్రామాల సమీపంలో ఉన్న కల్వర్టుల వద్ద, మీనవోలు సమీపంలో కట్టలేరుపై నిర్మించిన బ్రిడ్జి వద్ద, రావినూతల సమీపంలోని కల్వర్టు దగ్గర రోడ్డు కుంగిపోయి వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రం నుంచి రాయపట్నం, సిద్దినేనిగూడెం, నిదానపురం, మాటూరుపేట, ఇల్లూరు, చిలుకూరు తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు వంకర టింకరగా ఉన్నాయి. మలుపుల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పట్టణంలో వైఎస్ఆర్ చౌరస్తా, వాసవి థియేటర్ వద్ద, శాంతి థియేటర్ సమీపంలో, భగత్ సింగ్ సెంటర్లో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాలు వేగంగా వెళుతున్నాయి. పెను ప్రమాదాలు జరగకముందే ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపై సుబాబుల్ కర్రలు..

ట్రాక్టర్లలో, లారీల్లో సుబాబుల్ కర్రలు తరలించేటప్పుడు రోడ్లపై పడుతున్నాయి. ఈ కర్రలు పొడవుగా, నునుపుగా ఉండటం వల్ల రాత్రి సమయంలో సరిగా కనిపించగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కర్రలు రోడ్లపై అడ్డదిడ్డంగా పడటమే కాకుండా రోడ్డుపై ఉంచి సుబాబుల్ కర్రలు లోడ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతుంది.